క్లుప్తంగా

విచారణ



గుంపాంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ మోహనరావు

పూసపాటిరేగ: మండలంలోని గుంపాం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ ఎ. మోహనరావు మంగళవారం విచారణ చేపట్టారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులు, జనరల్ ఫండ్ నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన ఇనగంటి రాకేష్‌శర్మ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. రక్షితమంచి నీటి పథకం మరమ్మతులకు సంబంధించి పలుమార్లు నిధులు డ్రా చేసారని.. అలాగే రహదారి వేయకుండానే బిల్లు డ్రా చేసినట్లు ఫిర్యాదు అందింది. విచారణలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల ఆదిలక్ష్మి, కార్యదర్శి గాయత్రి, ప్రజాప్రతినిధి ఎడ్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కోనాడ విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన రెడ్‌రిబ్బన్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యార్థులు డి. సీజల్, యు. అశ్వనిలను హెచ్ఎం చలం, ఉపాధ్యాయులు చాముండేశ్వరి, తదితరులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య విద్యార్థిని హత్య దారుణం



ర్యాలీలో పాల్గొన్న మిమ్స్ వైద్య విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమని మిమ్స్ జూనియర్ వైద్యులు అనందిత, యామిని అన్నారు. ఈ మేరకు కొత్తపేట నీళ్ల ట్యాంక్ నుంచి మూడు లాంతర్ల వరకు మంగళవారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు తీయవద్దన్నారు. కార్యక్రమంలో సాయిలత, త్రివేద్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న సర్పంచ్ అప్పన్న, తదితరులు

నెల్లిమర్ల రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ, డిబేట్ పోటీల్లో కొండగుంపాం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది అభినందించారు. విద్యార్థులు ఎం. దీపిక, అమృత, హసిని, పి. దీపిక, జాహ్నవిలకు సర్పంచ్ పతివాడ అప్పన్న, గ్రామ పెద్దల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ



పూజలందుకుంటున్న మరిడి మహాలక్ష్మి

జామి: మండల కేంద్రంలోని గొర్లెవీధిలో కొలువై ఉన్న మరిడి మహలక్ష్మి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భోజనం రుచిగా ఉండాలి..



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓలు

గుర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే పౌష్టికాహారం రుచికరంగా ఉండాలని ఎంఈఓలు ఎస్. భానుప్రకాష్, ఎం. శ్రీనివాసరావు ఎండీఎం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని కొర్లానపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం వారు తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

దోమలను నిర్మూలించాలి..

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



రోనాల్డ్ రాస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ భాస్కరరావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: మలేరియా వ్యాధి ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల వస్తుందని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా సర్ రొనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వణుకుతో కూడిన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, చెమటలు పట్టడం, వాంతులు, వికారం, తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులుంటే వెంటనే సమీప ఆస్పత్రులకు వెళ్లి మలేరియా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స చేయించుకోవాలన్నారు. మలేరియా వ్యాధి దోమల ద్వారా వస్తుంది కాబట్టి, దోమలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీలైనంతవరకు అందరూ దోమతెరలు



కేంద్రియ విద్యాలయంలో మాట్లాడుతున్న డీఎంఓ మణి

వినియోగించాలని సూచించారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, వాడిపడేసిన టైర్లు, వాడకం లేని రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ పాత్రల్లో దోమల లార్వా పెరిగే అవకాశం ఉందన్నారు. ఫ్రిడ్జి వెనుక ఉన్న డ్రిప్‌బాక్స్, ఎయిర్ కూలర్లు, ఫ్లవర్ వాజ్‌ల్లో దోమలు ఉత్పత్తయ్యే అవకాశం ఉన్నందున ప్రతి మూడు రోజులకొకసారి శుభ్రం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంఓ మణి, డెమో చిన్నతల్లి, ఎపిడిమాలిజిస్ట్ జి. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత

మానవాళి ఆరోగ్యానికి ప్రమాదకరమైన దోమలను నిర్మూలించడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణాధికారి వై.మణి అన్నారు. కేంద్రియ విద్యాలయంలో ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఫలితంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ దోమల నివారణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ, ఫైలేరియా సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన తప్పనిసరి



నెల్లిమర్ల రూరల్: ఒమ్మిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. యూత్ ఫెస్ట్ 2024 కార్యక్రమం సందర్భంగా హెచ్ఐవీ, సుఖవ్యాధులపై జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక సంస్కృత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చని చెప్పారు. హెచ్ఐవీ సోకిన వారు మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని సూచించారు. అనంతరం క్విజ్ పోటీలో గెలుపొందిన ఎ.చైత్రాలి, ఆర్. శరణ్య, కె.లలిత, జె.హరిణి, తదితరులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ. కె. వెంకటరమణ, హెచ్ఎం లలితకుమారి, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సుఖవ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

నెల్లిమర్ల రూరల్: హెచ్ఐవీ, సుఖవ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉత్తరనాయుడు, కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ సోకకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఆమోదానికి గ్రామసభలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామంలో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయం చేసుకుని ప్రణాళికాబద్ధంగా గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలతో కలెక్టర్ మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభల నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామసభల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనేలా మండల అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సభలకు డ్వాక్రా మహిళలు ఎక్కువగా హాజరయ్యేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తిని ఆదేశించారు. అంతకుముందు డ్వామా పీడీ అరుణశ్రీ మాట్లాడుతూ .. గ్రామ సభల్లో ఉపాధి హామీ చట్టం గురించి వివరించాలన్నారు. డీపీఓ శ్రీధర్‌రాజా మాట్లాడుతూ.. 21న ప్రతి మండలంలో మాక్ గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొనేలా సర్క్యులర్ ఇవ్వడం జరిగిందని గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి నిర్మలాదేవి తెలిపారు.

వసతిగృహాల్లో తనిఖీలు చేపట్టాలి..

జిల్లాలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతి గృహాలు, ఆశ్రమాలను తనిఖీ చేసి తనకు రెండు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ అంబేడ్కర్ సంక్షేమాధికారులను ఆదేశించారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేయాలి..



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల తీర్మానం

విజయనగరం అర్బన్: మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేయాలని జనవిజ్ఞాన వేదిక, ప్రగతి శీల, అభ్యుదయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మహరాష్ట్రలో మూఢ నమ్మకాలపైక పోరాటం చేసి మతోన్మాదుల చేతిలో హత్యకు గురైన నరేంద్ర దాబోల్కర్‌కు నివాళులర్పిస్తూ, మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సంఘ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మూఢ నమ్మకాల వల్ల ప్రతిరోజూ అనేక మంది అమాయకులు, మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సాహితీ స్రవంతి, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, ఆశా కార్యకర్తల సంఘం, డీవైఎఫ్ఐ, పట్టణ పౌర సంక్షేమ సంఘం, మెడికల్ రిప్స్ సంఘం, కులవివక్ష వ్యతిరేక సంఘం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, అరసం, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

గేదెలవానిపాలెంలో ప్రత్యేక వైద్యశిబిరం



రైతుకు మందులు అందదజేస్తున్న ఏడీఏ గంగాధర్, తదితరులు

లక్కవరపుకోట: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని గేదెలవానిపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖాధికారులు మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ కొత్తవలస సబ్‌డివిజన్ సహాయ సంచాలకుడు గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఎల్.కోట, భీమాళి పశు వైద్యాధికారులు గాయత్రి, ఎస్. సత్యనాయరాయణ, తదితరులు 72 పశువులకు గర్భకోశ చికిత్సలు, 12 పశువులకు సాధారణ చికిత్స అందించారు. కార్యక్రమంలో చొప్ప దేముడు, తదితరులు పాల్గొన్నారు.

23న సామూహిక కుంకుమార్చనలు



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి సన్నిధిలో ఈ నెల 23న సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆ రోజు ఉదయం 7 గంటలకు విష్వక్సేన, పుణ్యాహవచనం, సుందరకాండ పారాయణాలు జరుగుతాయని.. 7.30 నుంచి 11 గంటల వరకు పూజా ప్రాంగణంలోకి భక్తులను అనుమతిస్తామన్నారు. మహాలక్ష్మి అమ్మవారికి గాజుల అలంకరణ పూర్తి చేసిన అనంతరం 11.30 గంటలకు శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం జరిపించి, భక్తులచే రామకోటిని రాయిస్తామన్నారు. కుంకుమార్చనల్లో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరపున పూజా సామాగ్రి, శ్రీరామచంద్రస్వామి, శ్రీలక్ష్మీ అమ్మవారి ఫొటో అందిస్తామన్నారు. 100 గ్రాముల ఆవునెయ్యి, నివేదనకు పండ్లు, పూజకు పుష్పాలు మాత్రమే తీసుకురావాలని కోరారు.

25న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ సదస్సు ఈ నెల 25న ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయభావన 538వ సభలో భాగంగా హరికథల్లో హాస్యరసం అనే విషయంపై హరికథా రాజహంస మంగిపూడి వేంకట రమణమూర్తి భాగవతార్ వివరిస్తారన్నారు. సాహితీవేత్తలందరూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైమ్: మెరకముడిదాం మండలం బుదరాయవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద పూతికవలస గ్రామ శివారుల్లో పేకాటాడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేసి 22 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సైలు సాగర్ బాబు, రామారావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారని చెప్పారు. అలాగే వారి వద్ద నుంచి 1,23,860 రూపాయల నగదు, 24 మొబైల్ ఫోన్లు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేఎల్ పురంలో చోరీ

విజయనగరం క్రైమ్: నగరంలోని కేఎల్.పురంలో కృష్ణ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న లక్షా తొంబై రూపాయల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు దోచుకున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై జె.తారకేశ్వరరావు తెలిపారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ



ఉపాధ్యాయులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎంపీటీసీ భవాని, సర్పంచ్ పాపునాయుడు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి ఉన్నత పాఠశాలకు ఆ స్కూల్ పూర్వ విద్యార్థి చప్ప వెంకటేష్ తన కుమార్తె జ్ఞాపకార్థం రూ.30 వేల విలువ చేసే యాసర్ ల్యాప్ ట్యాప్‌ను వితరణ చేశారు.ల్యాప్‌టాప్‌ను హెచ్ఎం ఆదిలక్ష్మికి ఎంపీటీసీ పాటుపు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ, సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం,దాతలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని, క్రమశిక్షణ అలవర్చు కోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఉపసర్పంచ్ చప్ప నారాంనాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు రాఘవ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన మరమ్మతులు

- ఎస్పీ వకుల్ జిందాల్
- పాత మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు



పాత మహిళా పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: నగరంలోని పద్మావతీనగర్‌లో ఉన్న పాత మహిళా పోలీస్‌స్టేషన్ భవనానికి త్వరితగతన మరమ్మతులు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మహిళా పీఎస్‌లను దిశా మహిళా పీఎస్‌లుగా గత ప్రభుత్వం మార్పు చేయడంతో ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా పోలీస్ బ్యారెక్స్‌కు ఆనుకుని దిశా మహిళా పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. అయితే నాటి నుంచి పద్మావతీనగర్‌లో ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్ బిల్డింగ్ నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం బిల్డింగ్ చుట్టూ మొక్కలు పెరిగిపోవడం, లోపల పేరుకుపోయిన చెత్తా, చెదారాలను వెంటనే తొలగించాలని ఏపీ పోలీస్ హౌసింగ్ బోర్డు అధికారులను ఆదేశించారు. త్వరగా మరమ్మతులు చేపడితే పోలీస్ శాఖ అవసరాలను బట్టి వినియోగించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. పరిశీలనలో ఎస్బీ సీఐ కేకేవీ విజయనాథ్, ఏపీ పోలీస్ హౌసింగ్ ఏఈ ఆర్.రాజబాబు, కాంట్రాక్టర్ ఎస్.రమణ ఉన్నారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి ..



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

- వైద్యాధికారులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి

పూసపాటిరేగ: దోమలను సమూలంగా నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేయాలని వైద్యాధికారులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, నివారణ, లక్షణాలను గుర్తించడం, చికిత్సపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేదమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్ నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్వీ రమణ, మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



సత్కారం పొందుతున్న అంతర్జాతీయ యాత్రికుడు, రచయిత, ఫొటోగ్రాఫర్ బీరా అశోక్

విజయనగరం అర్బన్: స్థానిక కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ అంతర్జాతీయ యాత్రికుడు, రచయిత, ఫొటోగ్రాఫర్ బీరా అశోక్ మాట్లాడుతూ, ప్రతి ఫొటో ఒక కథ, ఒక సందర్భం, ఒక సంస్కృతిని ప్రతిబింబించే సాధనమన్నారు. అనంతరం విద్యార్థులకు ఫొటోగ్రఫీపై హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇచ్చారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్, జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీని కేవలం సాంకేతిక పరిజ్ఞానంగా కాకుండా ఒక కళాత్మక ప్రక్రియగా చూడాలన్నారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించండి..



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: సువర్ణముఖి నదిలో వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరద నివారణకు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, భూగర్భజలాలను వృద్ధి చేసేందుకు సువర్ణముఖి నదిలో కొండచాకరాపల్లి వద్ద పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని నీటిపారుదల శాఖ అధికారులు ఇచ్చిన నివేదికపై చర్చించారు. దీనికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకుని, వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.సేతుమాధవన్, భూగర్భ గనులశాఖ డీడీ సూర్యచంద్రరావు, ఆర్‌డీఓలు బి.శాంతి, ఎంవీ సూర్యకళ, పీసీబీ ఈఈ సరిత, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదరావు, మైన్స్ ఎ.డి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో పైడితల్లి



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలంతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/విజయనగరం టౌన్